కాంగ్రెస్ నాయకుడికి సీఎం పరామర్శ

కరీంనగర్ టౌన్, జనవరి 28: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన పీసీసీ అధికార ప్రతినిధి సత్తు మల్లేశంను ఫోన్‌లో పరామర్శించారు. మూడురోజుల క్రితం మల్లేశం తండ్రి నర్సయ్య మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.



ఇంటర్వ్యూ

'కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ ఏర్పాటు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తున్నారు. అందులో భాగంగానే కరీంనగర్ ఎంపీగా ప్రజలు నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కూడా ఇదే చెబుతున్నారు. మళ్లీ నేను ఎంపీగా విజయం సాధించడం ఖాయం' అని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఎంపీగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుంటూ మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అత్యధిక మెజారిటీతో ఎంపీ సీటు గెలుస్తాం..

ఆంధ్రజ్యోతి: బండి సంజయ్ ఎంపీ అయ్యాక కరీంనగర్‌కు చేసిందేమి లేదని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. స్మార్ట్ సిటీ పనులు, అభివృద్ధి పనులు బీఆర్ఎస్ వల్లే జరుగుతున్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. దీనిపై మీ సమాధానమేంటి?

బండి సంజయ్‌కుమార్: ఇంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదు. నేను ఎంపీగా గెలిచిన తర్వాత వేల కోట్ల రూపాయల నిధులు తీసుకు వచ్చాను. కేంద్ర మంత్రితో మాట్లాడి కరీంనగర్-వరంగల్, కరీంనగర్-జగిత్యాల, ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల సహా రోడ్ల నిర్మాణం కోసం ఎనిమిది వేల కోట్లకు పైగా నిధులు తీసుకు వచ్చాను. కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణానికి నిధులు తెచ్చాను. శాతావాహన యూనివర్సిటీకి అటానమస్ హోదా, ఎస్సారార్ కళాశాలకు '12బి' హోదా కల్పించాను. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మూడు వేల ఇళ్లు మంజూరు చేయించా. కేంద్రంతో మాట్లాడి పదివేల ఇళ్లయినా తీసుకు వస్తానని చెబితే ఒక్క ఇల్లు కూడా కట్టకుండా ఆ నిధులను దారి మళ్లించారు. ఇప్పుడు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఎంపీగా ఏం చేశానో ఎన్ని నిధులు తీసుకువచ్చానో పుస్తకంగా ప్రచురించి గ్రామ గ్రామాన ప్రజలకు అందజేస్తా. అందులోని వివరాలు చదివిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల నోళ్లు మూతపడతాయి. అప్పుడు వారు ఏదైనా అడిగితే జవాబు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

స్మార్ట్ సిటీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పనులు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని చెప్పే వీరు ఎందుకు పట్టించుకోవడం లేదు?

2015లో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ కింద గుర్తించి కేంద్రం 196 కోట్లు మంజూరు చేసింది. ఆనిధులను నాలుగు ఏళ్ల పాటు మళ్లించిన మూర్ఖులు బీఆర్ఎస్ నేతలు. నిధులు ఎందుకు దారి మళ్లించారని 2019 ఆగస్టులో, 2020 నవంబరులో కేంద్రం లేఖలు రాసింది. స్మార్ట్ సిటీ నిధులు ఖర్చుచేయడంతో పాటు మ్యాచింగ్ గ్రాంటు ఇస్తారా లేదా అని నిలదీసింది నేనే. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉంటూ సమావేశం ఏర్పాటు చేసి, ఆ లేఖలను బయటపెట్టి నిలదీస్తే అప్పటి సంబంధిత అధికారి అరవింద్‌కుమార్ నీళ్లు నమిలి సారీ చెప్పాడు.15 రోజుల్లోగా కేంద్రం ఇచ్చిన నిధులతో పాటు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోతే వడ్డీతో సహ వసూలు చేస్తామని హెచ్చరిస్తే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చింది. స్మార్ట్ సిటీ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులపై నేను గతంలోనే పరిశీలించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను నిలదీశాను. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అధికారులు, కాంట్రాక్టర్ల అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వమే సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా బీజేపీ గెలువ లేక పోయింది? మరి ఎంపీగా గెలిచే అవకాశాలు ఏలా ఉంటాయి?

అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సర్కారును దించాలనే కసితో ప్రజలు తీర్పు ఇచ్చారు. బీజేపీపై సానుకూలత ఉన్నా ఓట్లు చీలకూడదనే ఉద్దేశంతోనే తీర్పు అలా ఉంది. దేశంలో నరేంద్ర మోదీ హవా కనిపిస్తుంది. రాష్ట్రంలో ఎవరున్నా, ఢిల్లీలో మోదీనే ఉండాలని ప్రజలు అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన కింది స్థాయి నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. 2018 ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల ఫలితాలను లెక్కిస్తే బీజేపీకి లక్షా రెండు వేల ఓట్లుమాత్రమే వచ్చాయి. నాలుగు నెలల వ్యవధిలోనే జరిగిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 4.98 లక్షల ఓట్లు సాధించి 90 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందాను. ఈసారి ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో బీజేపీ 2.5 లక్షల ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది లక్షలకు పైగా ఓట్లు సాధించి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం తథ్యం.

పార్లమెంట్ సిట్టింగ్ స్థానాలను ఇతర నేతలు ఆశిస్తున్నారు కదా? కరీంనగర్ పోటీ చేయబోతున్నట్లు కొందరు నేతలు పోస్టర్లు వేసుకుంటున్నారు.. మీరే ఇక్కడ పోటీ చేస్తానని ఎలా చెబుతున్నారు?

బీజేపీ కార్యకర్తల పార్టీ.. సిద్ధాంతాలున్న పార్టీ.. పార్టీ కోసం ప్రజల కోసం పని చేసే నాయకులెవరికైనా టికెట్ అడిగే హక్కు ఉంటుంది. టికెట్ ఎవరికి ఇవ్వాలనే దానిపై మా జాతీయ నాయకత్వం సర్వేలు చేస్తున్నది. కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని, సర్వే నివేదికలు కార్యకర్తల మనోభావాలను పరిగనణలోకి తీసుకుని నిర్ణయం తీసకుంటుంది. అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాం. నాకే టికెట్ వస్తుందని కొందరు పోస్టర్లు వేసుకుంటున్నారు అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ఎవరికి టికెట్ ఇస్తారనే విషయం కొద్దిరోజుల్లో స్పష్టమవుతుంది.

ఎంపీ ఎన్నికల్లో హిందుత్వ నినాదంతోనే ప్రజల్లోకి వెళతారా? నియోజక వర్గ అభివృద్ధి కోసం ప్రజలకు ఏమైనా హామీ ఇస్తారా?

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణతోపాటు, కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ అభివృద్ధికి ఏం చేసిందనే అంశంపైనే ప్రధానంగా ప్రజల్లోకి వెళతాం. ముఖ్యంగా ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఖర్చు చేశామనే అంశంపై వివరాలు వెల్లడిస్తూ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలో హోర్డింగులు ఏర్పాటు చేస్తాం. ఊరూరా ప్రజల్లోకి వెళ్లి వివరిస్తాం. దీంతోపాటు హిందుత్వ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తాం. రాబోయే ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ కార్పొరేషన్, మున్సిపాలిటీలతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం తరపున అత్యధిక నిధులు తీసుకు వస్తాం. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోను విడుదల చేయాలనుకుంటున్నాం.

ఫిబ్రవరి 5 నుంచి కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో పాదయాత్ర చేస్తున్నట్లు ప్రకటించారు కదా? ఎన్ని రోజులు, ఎన్ని గ్రామాలు, ఎన్ని కిలోమీటర్లు పాదయాత్ర చేస్తారు?

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేసిందనే అంశంపై ప్రజలకు వివరించడంతోపాటు నేను ఎంపీగా గెలిచిన తరువాత కేంద్రంతో మాట్లాడి ఎన్ని నిధులు తీసుకు వచ్చా? ఎంపీగా గెలిపిస్తే ఉమ్మడి జిల్లా ప్రజలకు ఏం చేశాను? వారి గౌరవాన్ని ఏం విధంగా పెంచాను? ప్రజల పక్షాన ఏ విధంగా పోరాడననే అంశాలను వివరించేందుకు వచ్చే నెల 5 నుంచి పాదయాత్ర చేయాలని ప్రణాళిక రూపొందించాం. ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకే వెళ్తున్నా. ఇది పూర్తిగా పాదయాత్ర కాదు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేటప్పుడు వాహనంలో వెళతా. 20 రోజుల పాటు అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో పర్యటించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నా. రూట్‌మ్యాప్ వంటి అంశాలపై కసరత్తు చేస్తున్నాం. వారం రోజుల్లో వివరాలను వెల్లడిస్తాం.

బీజేపీ అంటేనే ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరు. కాని అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. నేతలమధ్య సమన్వయం కొరవడినట్లుంది?

అలాంటిదేమి లేదు, కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా ఇప్పుడున్న అన్ని రాజకీయపార్టీల కంటే బీజేపీ క్రమశిక్షణ ఉన్న పార్టీ. సిద్ధాంతాల పునాదులపై నడుస్తున్న పార్టీ. ఎవరో ఒకరిద్దరు నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తారు. వారు పార్టీని, కార్యకర్తలను పట్టించుకోరు. పని చేసే వాళ్లను ఇబ్బంది పెట్టాలని చూస్తారు. ఎన్నికల సమయంలో వచ్చి టికెట్లు కావాలని అడుగుతారు. అలాంటి వాళ్లను పార్టీ నాయకత్వం ఎప్పటికప్పుడు గమనిస్తుంటుంది. ఎప్పుడేం చేయాలో అధిష్ఠానానికి బాగా తెలుసు.

ఆర్టీసీ అభివృద్ధిలో సిబ్బంది భాగస్వాములు కావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- 45 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

భగత్‌నగర్, జనవరి 28: ఆర్టీసీ అభివృద్ధిలో సిబ్బంబది భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీం నగర్-2 డిపోలో కరీంనగర్, ఖమ్మం రీజియన్లకు చెందిన 45 మందికి కారుణ్య నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని 43 వేల మంది ఉద్యోగులు నిబద్ధత, క్రమశిక్షణతో పని చేస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకంతో డిసెంబరు 9 నుంచి మహిళలందరికి బస్సుల్లో ఉచితంగా ప్రయాణిసున్నారని తెలి పారు. దీంతో బస్సులన్నీ కిక్కిరిసి, ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చింద న్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం సమర్థవం తంగా పనిచేస్తున్న కార్మి కులందరిని అభినంది ంచారు. మహాలక్ష్మి పథకాన్ని సమర్థంగా నిర్వ హించ డానికి బస్సులు, ఉద్యోగుల సంఖ్యను పెంచేం దుకు చర్య లు తీసుకుంటు న్నామని, ఇందులో భాగంగా వెయ్యి బస్సులను కొనుగోలు చేస్తాస్తు న్నామని తెలిపారు. మూడు వేల మంది ఉద్యోగులను నియమించేందుకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. చిన్న చిన్న సమస్య లను కార్మికులు మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. ఆర్టీసీలో సంస్కరణల కోసం సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపిస్తా మని, జనవరి 31న ఆర్టీసీ కార్మికులకు శుభవార్త అందిస్తామన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి రఘునందన్ రావు, ఈడీ అడ్మిన్ ఎస్ కృష్ణకాంత్, రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత,డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ,డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ విలా స్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పర్సనల్ ఆఫీ సర్ చంద్రయ్య, సెక్యూరిటీ ఆఫీసర్ బాహూరావు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ హయాంలోనే సొసైటీలను బలోపేతం చేశాం..

చిగురుమామిడి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో సొసైటీలను బలోపేతం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని రేకొండలో హాళిక్ శ్రమజీవి కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహకర సంఘంలో అర్హులైన ప్రతి ఒక్కరూ సొసైటీలో సభ్యుడిగా చేరాలన్నారు. సొసైటీ తరపున రైతులకు ఉపయోగపడే వ్యాపారం చేయాలన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రేకొండ సొసైటీకి మంచి పేరు ఉందని, దాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండల కొమురయ్య, సర్పంచ్ పిట్టల రజిత శ్రీనివాస్, ఎంపీటీసీ సంధ్య రమేష్ పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 28: ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన జిల్లా సర్వ సభ్య సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భగవతి రమణారావు, కోశాధికారిగా రంగు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునిపట్ల తిరుపతిరెడ్డి, కరీంనగర్ అధ్యక్షుడిగా రావుల నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా చీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామన్నారు.

హుజూరాబాద్ పీవీ జిల్లా ఏర్పాటుకు కృషి

- అస్తవ్యస్తంగా జిల్లాల విభజన
- సంఘాలను చీల్చిన బీఆర్ఎస్
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

హుజూరాబాద్, జనవరి 28: హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. హుజూరాబాద్‌లో పీవీ జిల్లా సాధన సదస్సు ఆదివారం జరిగింది. మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ జిల్లా కోసం ఈ ప్రాంత ప్రజలు ఎనిమిదేళ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు.అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిందన్నారు. పీవీ అంటే భూ సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడన్నారు. ఆయన పేరిట జిల్లా ఏర్పాటు చేయడం తప్పేమీ లేదన్నారు. పీవీ జిల్లా ఏర్పాటు కోసం ఓ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు, జీవన, ఆర్థిక, భౌగోళిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్లాలన్నారు. ఉద్యమకారుడిగా తనను గుర్తించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందని, ఇది తనకు కొత్త బాధ్యత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘాలను చీల్చి ఘర్షణ వాతావరణం నెలకొల్పిందన్నారు. బీఆర్ఎస్ ధోరణిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామిక పాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. డబ్బులతో ఏమైనా చేయవచ్చనే అహంభావం బీఆర్ఎస్ నాయకుల్లో ఉందన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో పనిచేస్తామని, బీఆర్ఎస్ పార్టీ ధోరణిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రయత్నం చేస్తామన్నారు. టీజేఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయబోమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కోసం సహకరిసామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, ఆవునూరి సమ్మయ్య, భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకట్రాజం, రవీందర్‌రావు, పత్తి కృష్ణారెడ్డి, పి ఈశ్వర్‌రెడ్డి, వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్, అర్కిళ్ల స్రవంతి, మోరె గణేష్, సతీష్‌యాదవ్, రవీందర్, శివదయాల్‌సింగ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

వైభవంగా గోదా రంగనాథస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: కరీంనగర్ వేదభవనంలో త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి పర్యవేక్షణలో, వికాసతరంగిణి ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తీర్థగోష్ఠి అనంతరం అందంగా అలంకరించిన కల్యాణ వేదికపై వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యుల బృందం వైదిక నిర్వహణలో వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లా డుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. గోదాదేవి అచంచల భక్తి శ్రద్ధలతో శ్రీరంగనాథుడిని చేరిందని, భక్తి మార్గం చాలా గొప్పదని అన్నారు. చిన్న జీయర్ స్వామి పిలుపు మేరకు సమతాకుంభ్-2024లో భాగంగా అన్ని ప్రాంతాల వారు సకల జనుల క్షేమం కోసం 27 రోజుల దీక్షను చేపట్టి శంషాబాద్‌లోని సమతా స్ఫూర్తి కేంద్రానికి 28వ రోజున ఉదయం చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు, డాక్టర్ జగన్నాథరెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అశోక్‌రావు, ప్రతాపరెడ్డి, రవీందర్‌రావు, జగన్నాథరావు, ఎస్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, జనవరి 28: టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు జి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర మహాసభల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జి తిరుపతిరెడ్డి, డి భూపాల్‌రెడ్డి, రమణాచారి, పర్శరాములు, పోచయ్య, అర్కాల శ్రీనివాస్, శశిధర్, రాజయ్య, సంధ్యారాణి, బాలయ్య, వై తిరుపతి, రాంనారాయణ, స్వామి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా.. బీసీ స్టడీ సర్కిల్

- 28 రకాల ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, జనవరి 28: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రెండు, మూడు నెలలు చదివితే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. చదువులకే బోలెడు డబ్బులు ఖర్చవుతున్నాయి.. ఖర్చులు భరించలేని పేద విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ వరంలా మారింది. కరీంనగర్‌లో జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ పక్కన బీసీ స్టడీ సర్కిల్ ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన నోటిఫికేషన్లకు అనుగుణంగా ఇక్కడ శిక్షణ ఇస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు గ్రంథాలయంలో చదవుకోవచ్చు. అవసరమైన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లడానికి అనుమతిస్తారు. తరగతుల విరామ సమయంలో టీ, బిస్కెట్, అల్పాహారం అందిస్తారు. ప్రతి రోజూ తరగతులకు హాజరైన వారికి ఉచితంగా మెటీరియల్ అందజేస్తారు. ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.బీసీలకు 75 శాతం, ఎస్సీలకు 16, ఎస్టీలకు 6,ఇతర కులాలకు 3 శాతం, మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తారు. ఇప్పటి వరకు స్టడీ సర్కిల్లో శిక్షణ తీసుకున్న 148 మంది ఉద్యోగాలు సాధించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి 28 రకాల ఫౌండేషన్ కోర్సులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.


బీసీ స్టడీ సర్కిల్‌లో చదువుకుంటున్న యువత


కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్

నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ రవి కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్



బీసీ స్టడీ సర్కిల్ కు వచ్చే నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఉమ్మడి జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఫిబ్రవరి మొదటి వారంలో గ్రూప్స్ కోచింగ్ ప్రారంభమవుతుంది. ఉపకార వేతనం, స్టడీ మెటీరియల్ అందిస్తున్నాం. నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

పేద వైష్ణవులను ఆదుకోవాలి

ఇల్లందకుంట, జనవరి 28: రాష్ట్రంలోని నిరుపేద శ్రీవైష్ణవులను ఆర్థికంగా ఆదుకోవాలని వైష్ణవ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డింగరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీవైష్ణవి సేవా సంఘం పేద వైష్ణవులకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పేద వైష్ణవులకు ఆర్థిక, వైద్య, విద్య పరంగా ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అందులో నిరుపేద వైష్ణవులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో డింగరి శ్రీధర్, సముద్రాల ప్రసాదచార్యులు, సముద్రాల సుదర్శనాచార్యులు, శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులతో పాటు 350 మంది పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జమ్మికుంట రూరల్, జనవరి 28: జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంకని బాను, పార్లమెంట్ ఇన్‌చార్జి దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, కన్వీనర్లు శిరీష, జన్ను స్వరూప, మిడిదొడ్డి స్వప్న హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో మంద బాలన్న, మేకల రవీందర్, మారపల్లి మొగిలయ్య, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న జనజాతర

- రాజన్న సన్నిధికి తరలివస్తున్న భక్తులు - గర్భాలయ ప్రవేశం నిలిపివేసిన అధికారులు



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో కిటకిట లాడుతోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తేదీ సమీపిస్తున్న క్రమంలో వేములవాడకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో రాజన్న క్షేత్రంలో భక్తజన జాతర కొనసాగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 వేల మందికి పైగా భక్తులు తమ ఇష్టదైవమైన రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం సర్వదర్శనం శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా మూడు రోజులుగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరగా సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం పడుతోంది. మరోవైపు బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించిన ఫిషరీస్ సొసైటీ



రిజర్వాయర్‌ని పరిశీలిస్తున్న బృందం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: రామగుండం ఎన్టీపీసీ జలాశయాన్ని ఆదివారం తెలంగాణ ఫిషరీస్ సొసైటీ బృందం సందర్శించింది. ఎన్టీపీసీ జలాశయంలో తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈనేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుతో మత్యకారులపై ఎటువంటి ప్రభావం చూపే అవకాశం ఉన్నదనే అంశాన్ని పరిశీలించారు. సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తేలియాడే సౌరవిద్యుత్ కేంద్రం దాదాపు సగానికి పైగా జలాశయ విస్తీర్ణం అవసరం ఉంటుందని ఎన్టీపీసీ అధికారులు ఫిషరీస్ సొసైటీ బృందానికి వివరించారు. గతంలో జలాశయంలో చేపల వేటను కొనసాగించిన మత్స్యకారులను సోలార్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు తర్వాత అనుమతించడం లేదని అధికారులు తెలిపారు. విద్యుత్ కేంద్ర ఏర్పాటు కారణంగా ఉపాధిని కోల్పోతున్నామని సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ సొసైటీ ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. జలాశయంలో సౌర పలకల ఏర్పాటు చేయగా మిగిలిన విస్తీర్ణంలో తమకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించే లా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళాలని వారు ఫిషరీస్ సొసైటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జలాశయాన్ని పరిశీలించిన వారిలో తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు కనకయ్య, చంద్రశేఖర్‌తో పాటు ప్రతినిధులు ఉన్నారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వేములవాడ, జనవరి 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీసుధ దర్శించుకున్నారు. ఆదివారం నాడు కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ ఏఈవో బి శ్రీనివాస్ ప్రసాదం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్ అంతకు ముందు ఆలయ గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికారు. ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకుడు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ పవన్ అధికారులు వారి వెంట ఉన్నారు.



జస్టిస్ శ్రీసుధకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- ఎంపీ బండి సంజయ్ పూజలు



ఎంపీ బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయకమిటీ సభ్యులు

గన్నేరువరం, జనవరి 28: మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర ఉత్సవాలు ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్వామివారిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెలించుకున్నారు. ఆలయకమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు, బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నగునూరి శంకర్, గంప వెంకన్న, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, తిప్పర్తి నిఖేష్, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎంపీ

మండలంలోని ఖాసింపేట మానసా దేవి ఆలయం, గన్నేరు వరంలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం, మైలారంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలారం, ఖాసింపేట ఆలయాలలో ఆయనకు గజమాలను వేసి, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్, మచ్చ మురళి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ



జువైనల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ

కరీంనగర్ లీగల్, జనవరి 28: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు న్యామూర్తి పి శ్రీసుధ అన్నారు. ఆదివారం కరీంనగర్ కోర్టు భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్)కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్య త్తులో బాల నేరస్థుల కేసులు లేని జిల్లాగా కరీంనగర్ ఏర్పడాలని ఆశిస్తున్నానన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తే సత్వర న్యాయం జరిగి దేశంలోనే కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, మెజిస్ట్రేట్ సరళరేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, మేజిస్ట్రేట్‌లు, ప్రభుత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 36 ఆలయాల ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 36 ఆలయాల ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు సంబంధించి విజయగణపతి సాయిబాబా దేవాలయం, పాతబజార్ గౌరీశంకరాలయం, మంకమ్మతోట భక్తాంజనేయస్వామి ఆలయం, జెడ్‌పి క్వార్టర్స్‌లోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరి ట్రస్టు, భారత్ టాకీస్‌రోడ్ వీరాంజనేయస్వామి ఆలయం, మంకమ్మతోట వేంకటేశ్వరాలయం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయం, కోతిరాంపూర్ పోచమ్మ ఆలయం, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, హుజూరాబాద్‌లోని హనుమాన్ ఆలయం, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, తిమ్మాపూర్ నల్లగొండ సీతారామస్వామి ఆలయం, జమ్మికుంట వేంకటేశ్వరాలయం ఉన్నాయి. జగిత్యాల జిల్లాలోని శ్రీనివాస భవానీ ఆంజనేయ శంకరాలయం, బండ లింగాపూర్ గండి హనుమాన్ ఆలయం, మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం, రాయికల్, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయం, పొలాస పౌలస్తీశ్వరాలయం, జగిత్యాల రాజరాజేశ్వరాలయం, రాయికల్ ఆంజనేయస్వామి ఆలయం, మెట్‌పల్లి లక్ష్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు, మల్లాపూర్ గంగాగౌరీశ్వరస్వామి ఆలయం, కోరుట్ల వేంకటేశ్వరాలయం, కోటిలింగాల కోటేశ్వరాలయం, ఎరదండి మల్లికార్జున గంగామాత ఆలయం, సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నాయి. మంథని మహాలక్ష్మీ ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయం, సిరిసిల్ల జిల్లాలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం, శివసాయిబాబా ఆలయం, పోచమ్మ ఆలయం, విశ్వనాథ స్వామి ఆలయం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఆసక్తి గల వారు ధర్మకర్తలుగా ఉండేదుకు తమ దరఖాస్తులను 20 రోజుల లోపు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో గానీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి దేవాదాయ, పోలీసు శాఖల నుంచి వెరిఫికేషన్‌కు పంపిస్తారని, ఆ తర్వాత ఎంపికైన వారి లిస్టు రాష్ట్ర కమీషనరేట్ ద్వారా వస్తుందని తెలిపారు. అనంతరం ఎంపికైన వారితో పాలక వర్గ ప్రమాణ స్వీకారం చేయిస్తామని తెలిపారు.

విద్యుత్ బిల్లులు కాజేసిన కేసులో ఒకరి అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మానకొండూర్‌లోని వెనుకబడిన తరగతుల సమీకృత హాస్టల్‌లో రూ. 31లక్షల విద్యుత్ బిల్లులను కాజేసిన కేసులో అప్పటి వార్డెన్ అన్నలదాసు లక్ష్మీనారాయణను సీఐ రాజ్‌కుమార్ అరెస్టు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని హాస్టల్ వార్డెన్‌గా 2018 నుంచి 2021 వరకు అన్నలదాసు లక్ష్మీనారాయణ విధుల్లో కొనసాగారు. హాస్టల్‌లోని 31లక్షల రూపాయల మేరకు విద్యుత్ బిల్లులను కాజేసాడని జిల్లా బీసీ వెల్ఫేరు అధికారి అనిల్‌కుమార్ అతడిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరుపాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఆదివారం పేకాడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. వారి నుంచి 14వేల రూపాయలు స్వాధీనం చేసుకొని మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ అనుబంధ పుట్టపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తోకారం శ్రీనివాస్‌కు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. మంటలు చెలరేగుతుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలానికి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి



మాట్లాడుతున్న గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్

మెట్‌పల్లి, జనవరి, 28: రాష్ట్రంలోని గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని నరేంద్ర గార్డెన్‌లో నియోజక వర్గంలోని గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చెపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి బీమా సౌకర్యం, 50 ఏండ్లుపై పడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్ మాట్లాడుతూ జీవో 06 రద్దు చేయాలని, గంగపుత్రులకు ఉచిత వాహనాలు, చెరువుల అభివృద్ధి, చెపపిల్లలకు బధులుగా చెరువులో నాణ్యమైన చేపలను చెరువులో పెంచుకోవడానికి నగదును అందజేయాలనినియోజక వర్గంలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో సంఘ భవనాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచంద్ మాట్లాడుతూ గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్లు పర్రె శంకర్‌రాజు, ఎల్లా శ్రీనివాస్, పల్లికొండ భూమేష్, సముద్రాల రూప, శ్రీనివాస్, లచ్చయ్య, రాజయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి మాజీ సర్పంచ్ మృతి

బీర్‌పూర్, జనవరి 28: మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి(54) ఆదివారం ఉదయం తాను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొలానికి నీరు పారించడం కోసం వెళ్లాడు. పొలానికి వెళ్లిన ఎల్లారెడ్డి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలం వద్దకు వెళ్లి గమనించారు. అప్పటికే ఎల్లారెడ్డి వ్యవసాయ బావిలో పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఎల్లారెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ గజేంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే బిల్లులు రాకుండా అడ్డుకున్నారు

- గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు ఆవేదన



లింగంపల్లి బాలరాజు

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమను నాలుగేళ్లుగా మానసికంగా వేధించి, బిల్లులు రాకుండా అడ్డుకున్నారని మండలంలోని గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు సెల్ఫీ వీడియోను విడుదల చేసి మండల సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. తాము ఆర్థికంగా నష్టపోవడంతో ఉన్న 30 గుంటల భూమిని అమ్ముకుని కరీంనగర్‌కు పోయి కులవృత్తి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. తమ ఉసురు అతడికి తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియో వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

- ఐదు సార్లు తలనీలాల టెండర్లు వాయిదా
- మరో సారి 1న నిర్వహణకు ఏర్పాట్లు
- ఆరు నెలలుగా దేవస్థానం తరుపున సేకరణ



తలనీలాలు తీస్తున్న సిబ్బంది



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, జనవరి 28: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో భక్తులు సమర్పించే తలనీలాలకు టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో జీఎస్టీ నెపం, ప్రస్తుతం మార్కెట్‌లో కురులకు ధ రలు పడిపోయాయని పేర్కొంటూ తలనీలాలు సేకరించే కాంట్రాక్టర్ టెం డర్లలో పాల్గొనడం లేదు. నెల రోజులుగా దేవస్థానం అధికారులు అయిదు సార్లు టెండర్లు ఆహ్వానించగా టెండర్లు దాఖలు కాలేదు. క్రితం సారి దానిలో ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేయగా దాన్నీ రద్దు చేసిన అధి కారులు మరో సారి ఫిబ్రవరి 1న ఆరవ సారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంజన్న భక్తులు తమ మొక్కుల రూపేణ తలనీలాలు స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీ కాగ వాటిని సేకరించడానికి దే వస్థానం తరుపున టెండర్లు నిర్వహించి వాటి సేకరణ వ్యాపారులకు అప్పగిస్తుంటారు. నాలుగేళ్లగా జీఎస్టీని వ్యాపారులకు అంటగ ట్టడంతో సేకరణపై సందిగ్ధం ఏర్పడింది. హెచ్చు పాట దారు తన టెండర్ ధరలపై జీఎస్టీ చెల్లించాలనే నిబంధనలు కురుల సేకరణపై ప్రభావం పడ్డాయి. దీంతో వ్యాపారులు టెండర్లకు ముందుకు రాక పోగా ఇప్పుడు అంతర్జా తీయ మార్కెట్‌లో కురులకు ధరలు పడిపోయాయని కాంట్రాక్టర్లు టెండర్లకు రావడం లేదు. దీంతో తలనీలాల సేకరణ దేవస్థానం అధికారుల పై నే పడింది. ఆరు నెలలుగా సిబ్బంది వాటిని సేకరిస్తుండగా వాటిని భద్ర పరచడం ఇబ్బందిగా మారింది.

● అప్పుడు జీఎస్టీ.. ఇప్పుడు ధరల లేమి..

తలనీలాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేయాలనే ఆదే శాల నేపథ్యంలో జీఎస్టీ నిబంధనలతో వ్యాపారులు టెండర్లలో పాల్గొనడం లేదు. అయితే హెచ్చు పాటదారుకు టెండర్ సొమ్ములపై జీఎస్టీ విధించి చెల్లించాలనే నిబంధనలపై ఓ వ్యాపారి జీఎస్టీ కింద చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇప్పుడది కోర్టు పరిధి లో ఉండడంతో మరో వ్యాపారి తన టెండర్ కాల పరిమితి ముగిసినప్పటికీ జీఎస్టీ కింద చెల్లించాల్సి సొమ్ములు బకాయిలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్టీని మినహాయిస్తేనే టెండర్‌లో పాల్గొంటామని పేర్కొన్న కాంట్రాక్టర్లు తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో కురుల ధరలు పడిపోయాయని ధరలు తగ్గిస్తేనే టెండర్లకు ముందుకు వస్తామని అంటున్నారు. ఇందులో భాగంగా జూలైలో తలనీలాలకు దేవస్థానం అధికారులు టెండర్లు పిలవగా వ్యాపారులు ముందుకు రాలేదు. అప్పటి నుంచి శుక్ర వారం వరకు దేవస్థానం అధికారులు ఐదు సార్లు టెండర్లు నిర్వహించారు. కంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసుకుంటూ వెలుతున్నారు.

● క్రితం సారి..

క్రితం సారి ఏడాది కాలపరిమితికి గాను రూ.3.65కోట్లు కాగా దేవస్థా నం అధికారులు ప్రతి ఏటా పది శాతం పెంపుతో టెండర్లు నిర్వహిస్తుం టారు. జీఎస్టీ, ధరల లేమితో కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రాకపోవ డంతో టెండర్ సొమ్ములను తగ్గిస్తారా అనేది దేవాదాయ శాఖ అధికారు లు తేల్చాల్సి ఉంది. దేవస్థానం అధికారులు ఇప్పటి వరకు అయిదు సార్లు వేలంకు షెడ్యూల్ జారీ చేశారు. నాలుగు సార్లు ఎవరూ పాల్గొనగకపోగా రెండు రోజుల క్రితం ముగిసిన దానికి మాత్రం ఒక్కరు పాల్గొన్నారు. దీం తో అది రద్దు చేయాల్సి వచ్చింది. మళ్లీ గురువారం నిర్వహించడానికి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు.

● తమ వాదనలు చెప్పకుండా, టెండర్లకు దూరం

అయితే కాంట్రాక్టర్లు తాము ఏ కారణం చేత టెండర్‌కు దూరంగా ఉం టున్నారో చెప్పాల్సి ఉండగా టెండర్‌లో పాల్గొనకపోవడం దేవస్థానం అధి కారులకు కూడా తలనొప్పిగా మారింది. టెండరులో పాల్గొని జీఎస్టీ కాని మార్కెట్‌లో ధరలు లేవని తేల్చి చెబితే దాన్ని దేవస్థానం అధికారులు దే వాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. గతంలోనూ పలు మార్లు నిర్వహించిన టెండర్‌లో తక్కువకు పాట పాడితే కమిషనర్ కు తెలిపి తగ్గించి అప్పగించిన దాఖలాలు ఉండగా ఇప్పుడు కూడా కాం ట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొంటే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

● దేవస్థానం తరుపున సేకరణ

తలనీలాల టెండర్ గత జూలైతో ముగియగా అంతకు ముందే నిర్వహించిన టెండర్‌లో వ్యాపార సంస్థలు పాల్గొనకపోవడంతో దేవస్థానం త రుపున అధికారులు తలనీలాలు సేకరిస్తున్నారు. ఆగస్టు నుంచి దేవస్థా నం సిబ్బందే వాటిని సేకరిస్తూ భద్రపరుస్తున్నారు. ఇది అధికారులకు ఇ బ్బందికరంగా పరిణమించింది. సేకరించిన తలానీలాల నిల్వలు పెరిగిపో తుండగా ప్రస్తుతం సేకరిస్తున్న తలనీలాలను టెండర్ అయ్యాక సదరు వ్యాపారికి అప్పగించేందుకు అధికారులు నిర్ణయించారు.

కమిషనర్‌కు నివేదిస్తాం..



కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకపోవడం పై కమిషనర్ దృష్టికి తీసు కెళ్లాము. మార్కెట్‌లో ధరలు లేవని వ్యాపార సంస్థలు వెనుకంజ వేస్తున్న ట్లు తెలుస్తోంది. మరో సారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. తలనీ లాల టెండర్‌కు అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. టెండర్‌లో పాల్గొంటే వారి అభిప్రాయాలను కమిషనర్‌కు నివేదించే అవకాశం ఉంటుంది.

- పి వెంకటేష్, ఈవో

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, జనవరి 28: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపాడడంతో పాటు రాబోయే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులను కేటాయించి విద్యారంగాన్ని పరిరక్షించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. నూతనం గా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారం గాన్ని పరిరక్షించాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని, ప్రజల భావోద్వేగాలను రాజకీ యాలకు వాడుకుంటుందన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందన్నారు. భారత రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగహన కల్పించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్య క్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీం దర్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, పోలాస మల్లేశం, కొత్వాల్ ప్రవీణ్, పాశం భాస్కర్, కొక్కుల బాలరాజు, తుమ్మనపెల్లి నరేష్, పసుల సత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు అద్దాల ధ్వంసం

మల్యాల, జనవరి 28: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశాడు. దిగువ కొండగట్టు వద్ద జగిత్యాల వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు వెనుకాల అద్దాలపై ఆ వ్యక్తి బండరాయితో కొట్టడంతో అద్దం పగిలింది. ప్రయాణికులు తక్కువ ఉండడంతో ప్రమాదమేమి చోటుచేసుకోలేదు. అయితే అద్దానికి అయ్యే ఖర్చులు భరిస్తానని సదరు వ్యక్తి పేర్కొనడంతో ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 28: నగరంలోని గంజ్ హైస్కూల్ 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం బొమ్మకల్ గ్రామంలో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంగల్‌దాస్ శ్రీనివాస్, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేకుర్తి కంటి ఆసుపత్రికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండా వేణుమూర్తి

కరీంనగర్ రూరల్, జనవరి 28: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార రేకుర్తి నేత్ర వైద్యశాల నేత్ర విభాగంలో సేవ చేస్తున్నందుకు అరుదైన అవార్డును అందుకుంది. ముంబైలో జరుగుతున్న గివ్ కాన్‌క్లేవ్ భారత దేశంలోని 1000కి పైగా ఉదార సంస్థల సమావేశంలో 25 సంవత్సరాల నుంచి నేత్ర విభాగంలో సేవ చేస్తున్నందుకు రేకుర్తి వైద్య శాలకు అవార్డు దక్కింది. అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ చేతుల మీదుగా అవార్డు అందు కున్నారు. భారతదేశంలో నిర్వహిస్తున్న పెర్మనెంట్ ప్రాజెక్టు యొక్క ఎగ్జిబిషన్‌లో 200 స్టాల్స్ ఏర్పాటు చేయగా, అందులో రేకుర్తి ఆసుపత్రికి అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బ్రియన్ షేహాన్, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు, జితేంద్ర చావున్, మతన్‌గోపాల్, ఆర్ సునీల్‌కుమార్‌లు అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. రేకుర్తి కంటి ఆసుపత్రి నుండి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, సెక్రటరీ ప్రకాష్ హోల్ల, కోశాధికారి బొమ్మ పవన్‌కుమార్, చిదుర సురేష్, ఇంజినీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ టి.మురళీధర్‌రావు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ఎన్‌సీసీ పరీక్ష

కరీంనగర్ రూరల్, జనవరి 28: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కల్నల్ డాపియెల్ లాట్‌జెమ్, సుబేదార్ మనోహర్‌సింగ్, హకీం సింగ్, మోస్ నాయక్, గోవింద్‌నాయక్, పివి రావు, ఏఎన్‌ఓలు త్రివేణి, ప్రకాశ్, ప్రశాంత్, రాజేష్, జ్యోతిలత, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

బిర్లా కిండర్ గార్డెన్‌లో స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పట్టాలు పొందిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

కరీంనగర్ రూరల్, జనవరి28: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో కిండర్ గార్డెన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాగ్నిఫిసెంట్ సెవెన్ వండర్స్ అక్రాస్ టైం అనే పేరుతో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాన్ని మార్చే సత్తా విద్యార్థులది

జమ్మికుంట, జనవరి 28: దేశాన్ని మార్చే సత్తా విద్యార్థులదని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003- 2006పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మా ట్లాడుతూ అనేక మంది విద్యావంతులు, మేధావులను తయారు చేసిన ఘనత ఈ కళాశాలదని అన్నారు. ఎంత ఎత్తు ఎదిగినప్పటికి స్నేహితులను మర్చిపో వద్దని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంబాడి రవి, పూర్వ విద్యార్థులు, జడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, సంతోష్, తాజుద్దీన్, శివకృష్ణ, రమేశ్, ప్రభాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, నాగరాజు, రజిత, సంపూర్ణ, సునీత, విజయ, గీతారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మానకొండూర్, జనవరి 28 : మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో 1964-65లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిసా రు. మానకొండూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరినొకరు పలక రించుకొని అప్పటి తీపి గుర్తులను, చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. అ నంతరం సహపంక్తి భోజనం చేసి వెళ్లిపోయారు. సిరిపురం పోచెట్టి, శ్రీశైలం, నారాయణరెడ్డి, వీరేశం, రాజమల్లయ్య, ప్రభాకర్, ప్రకాశ్‌రావు, తాజ్మల్‌హుస్సే న్, రాజిరెడ్డి, మల్లేశం, అంజయ్య, సుధాకర్‌లు పాల్గొన్నారు.

వీణవంక: బేతిగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠ శాలలో 1981-82లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహిం చారు. తమకు అనాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

సమాజంపై కళాకారుల ప్రభావం ఎక్కువ



ట్రోఫీని అందజేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తిమ్మాపూర్, జనవరి 28: సమాజంపై కళాకారుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ షార్ట్ ఫిల్మ్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన హాజరై అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, తెంగాణ షార్ట్‌ఫిల్మ్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐలు రమేశ్, జిల్లా అధ్యక్షుడు చొప్పరి సుధాకర్, షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేసిన మంత్రి

చిగురుమామిడి, జనవరి 28: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, సాక్స్‌లు, బూట్లును మంత్రి పొన్నం ప్రభాకర్ అదివారం పంపిణీ చేశారు. ఆయన వెంట పాఠశాల కమిటీ చైర్మన్ మంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా తమకు పర్మినెంట్ జీతాలు ఇవ్వాలని మండలంలోని ఆశా వర్కర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. వారి డిమాండ్లపై మంత్రి సా నూకులంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆశావర్కర్లు సన్మానించారు. కార్యక్రమంలో మారెల్ల శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్థుల అభివృద్ధికి సహకారం అందిస్తా



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న గోపా నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి 28: గౌడ కులస్థుల అభివృద్ధికి సహకారం అందిస్తా నని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని మాచర్ల గార్డెన్‌లో ఆది వారం రాత్రి గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) జిల్లా అధ్యక్షుడు అమరగోని నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్‌లను సభ్యులు ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేతివృత్తుదారు లకు ప్రభుత్వ పరంగా చేయూత నివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తాను బలహీనవర్గాల మంత్రిగా అన్ని రకాల సహకారాన్ని అందిస్తానని అన్నారు. గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతానని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. గౌడ్‌లు రాజకీయంగా, అన్ని రంగాలలో ఎదగాలని అన్నారు. గోపాను అన్నిరకాల సహకారం అందిస్తానని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎల్లమ్మ దేవాలయాలను, గౌడ హాస్టల్‌ను అన్నిరకాల అభివృద్ధి చేస్తానన్నారు. కొందరు భూకబ్జా లకు పాల్పడ్డారని, నేడు వారిపై ఫిర్యాదులు వస్తుంటే గజగజ వణుకు తున్నారని పొన్నం అన్నారు. ఈ కార్యక్రమంలో గోపా నాయకులు అమరేందర్ గౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జక్కుల మల్లేశం, మాచర్ల ప్రసాద్, పెంటయ్యగౌడ్, అంకుస్‌గౌడ్, పొన్నం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్, జనవరి 28: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మిని స్టేడియంలో ఇటీవల నిర్వహించిన శ్రీచైతన్య విద్యాసంస్థల వార్షిక క్విట్ ఇండియా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ శ్రీచైతన్య ఐపీఎల్ విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ చాటారు. ఈ క్రీడల్లో కరీంనగర్, మంచిర్యాల జోన్‌లలోని 13 పాఠశాలల నుంచి 1339 మంది విద్యార్థులు పాల్గొన్నారని శ్రీచైతన్య కరీంనగర్ ఐపీఎల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఆచార్య తెలిపారు. ఈ పోటీల్లో ఐపీఎల్ విద్యార్థులు చెస్, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో పోటీపడి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, విద్యాసంస్థల చైర్మెన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఐపీఎల్ ఇంచార్జీ శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్, పీఈటీలు రంగు ప్రసాద్, సుప్రజ పాల్గొన్నారు.

'పారమిత'లో క్రీడోత్సవాలు

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 28: జిల్లా కేంద్రంలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో ఆదివారం విక్టరీ కార్నివాల్ పేరుతో వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాలను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద్‌రావు చిన్నారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులకు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలకు మనోల్లాసాన్ని కలిగించే ప్రత్యేక ఆటలను నిర్వహించారు. విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు బాస్కెట్‌బాల్ విన్యాసాలు, ప్యారాచూట్ విన్యాసాలు, మాస్‌డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేశ్, అనూకర్‌రావు, వినోద్‌రావు, హన్మంతరావు, వియూఎం ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కవితప్రసాద్, బాలాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సంబరాలు

కరీంనగర్ రూరల్, జనవరి 28: నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాల (సిబిఎస్ఈ) వీడ్కోలు సంబరాలు ఆది వారం ఘనంగా జరిగాయి. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాల న్నారు. విద్యార్థులు ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వియుఎం ప్రసాద్ వినోద్ రావు, ప్రిన్సిపాల్ రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, కో-ఆర్డినేటర్లు రాము, రవీంద్ర పాత్రో, హరిప్రియ, సరిత పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: నగరంలోని పంచముఖ హనుమాన్ దేవాలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాల కర పత్రాన్ని ఆదివారం ఆలయంలో హనుమాన్ పీఠాధిపతి పరబ్రహ్మానందగిరి స్వామి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 12, 13 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, బుస్స శ్రీనివాస్, తోట రాజేందర్, పిట్ల స్వామి, దేవిశెట్టి హనుమాండ్లు పాల్గొన్నారు.

'అనగనగా.. మా బడి పిల్లల కథలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జనవరి28: తెలుగు ఉపాధ్యాయుడు మాడుగుల రాములు ప్రధాన సంపాదకుడిగా విద్యార్థులచే రాయిం చిన 'అనగనగా... మా బడి పిల్లల కథలు' సంకలనం ఆవిష్కరణ ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉపాధ్యా యులు, కుటుంబ సభ్యులు, స్నేహి తులు చెప్పగా విన్న నీతి కథలను 84 మంది చిన్నా రులు తమ సొంత మాటల్లో రాశారు. డీఈవో సీహెచ్ జనార్దనరావు, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగిరాల చక్రవర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందా చారి తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్నేహ ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 28: బీహార్ రాష్ట్రంలో ఈనెల 27 నుంచి 31 వరకు జరుగుతున్న జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా బెజ్జంకికి చెందిన జె.స్నేహ ఎంపికైంది. ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఆమె జాతీయస్థాయి పోటీలకు పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైందని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన స్నేహను రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా యువజన క్రీడాధి కారి కీర్త రాజవీరు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జి జనార్దన్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘ సభ్యులు ఆనంద్‌కుమార్, రమణా రావు, నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటష్ తదితరులు అభినందించారు.

'గాండ్ల కులస్థుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న గాండ్ల కులస్థులు

గణేశ్‌నగర్, జనవరి 28: మా గాండ్ల కుల వృత్తిదారుల సమస్య లను పరిష్కరించాలని ఆది వారం గాండ్ల కులసంఘం జిల్లా అధ్య క్షుడు జక్కం సంపత్ ఆదివారం బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అంద జేశారు. మాకు దేవస్థానాలలో గండ దీపం వెలిగించే నూనె, దూపదీప నైవేద్యా లకు వంట నూనెలను సప్లై చేసే అనుమతిని మా కుల సంఘాలకు ఇవ్వాలని మంత్రి పొన్నంకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జక్కం సంపత్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన అతిపెద్ద దేవస్థానమైన వేములవాడలో కుల వృత్తిదారులకు వృత్తి పరమైన జీవనోపాధి కల్పించాలన్నారు. గాండ్ల కుల వృత్తిదారులమైన మాకు దేవస్థానాలలో గండ దీపం వెలిగించే నూనె, దూపదీప నైవేద్యాలకు వంట నూనెలను సప్లై చేసే అనుమతిని ఇవ్వాలన్నారు. వెనుకబడిన తరగతికి చెందిన గాండ్ల కులస్థులకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం పుల్లయ్య, గుజ్జేటి రవీందర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



హుజూరాబాద్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తాను అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వీణవంక, ఇల్లందకుంట మం డలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సంద ర్భంగా పార్టీలో చేరిన వారికి ప్రణవ్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపుని చ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చాటుదామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గె లుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఎల్లారెడ్డి, భిక్షపతి, సమ్మయ్య, కోమల్‌రెడ్డి, రవి, రాజయ్య, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

వీణవంక: మాల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, లస్మక్కపల్లి సర్పంచ్ భర్త దాసారపు లక్ష్మణ్ తన అనుచరులతో కలిసి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప సర్పంచ్ భిక్షపతి, మాజీ సర్పంచ్ ముద్దసాని సమ్మయ్య, నాయకులు షాబోద్దీన్, మేకల కోమల్‌రెడ్డి, గుమ్మరవి, రాజయ్యతో పాటు 300 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నంది సురేందర్ రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జి సామల రాజిరెడ్డి ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు.

కార్యవర్గం ఎన్నిక

శంకరపట్నం, జనవరి 28: కేశవపట్నం బ్రాహ్మ విద్యా శ్రమం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్మకొండ రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా త నుకు ఓంకారం, గౌరవ అధ్యక్షుడిగా తనుకు తిరుపత య్య, ఉపాధ్యక్షులుగా పాలడుగుల బాబన్న, వంగ సత్య నారాయణ, గిద్దమారి సుగుణ, చెనవేని స్వప్న ఎన్నిక య్యారు. కార్యదర్శులుగా కత్తెరమల్ల కిష్టస్వామి, కొత్తపల్లి రవి, గొడిశాల సదానందం, గుర్రం సుమలత, గొల్లపల్లి అనిత, కోశాధికారిగా తనుకు శ్రీనివాస్, ముఖ్య సలహాదా రులుగా తనుకు ప్రభాకర్, రాజమల్లు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, కార్యవర్గ సభ్యులు నర్సయ్య, పార్థసారధి, తిరుపతమ్మ, సమ్మక్క, మమత, రజిత, రేణుక, లక్ష్మి, ప్రచార కార్యదర్శిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు.

శివాలయం కార్యవర్గం

శంకరపట్నం, జనవరి 28: మండలంలోని కేశవపట్నం శివాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలడుగుల బాబన్న, ప్రధాన కార్యదర్శిగా భూపతి నాగభూషణం, ఉపాధ్యక్షులుగా పాలడుగుల సోమేశ్వర్, గుర్రం వెంకటేశం, గుర్రం శ్రీనివాస్, బొంగోని శ్రీనివాస్, కారుకూరి ప్రభాకర్, బోజనపల్లి శ్రీవాణి, పాలడుగుల భవానీ, కార్యదర్శులుగా గూడూరి మహేం దర్, గుండారపు శ్రీకాంత్, భూపతి శంకరానందం, తనుకు కుమారస్వామి, గుర్రం రాధిక, మాధవి, గుర్రం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా చల్ల అయిలయ్య, మోత్కూరి సమ్మయ్య, గుర్రం వీరయ్య, గాజుల శ్రీనివాస్, తనుకు ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లు, తిరుపతి, కోశాధికారిగా సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా చం ద్రశేఖర్, చంద్రమౌళి, కిష్టస్వామి, నర్సయ్య, వెంకటేశం, సదానందం, శారద, లక్ష్మి, విజయ, పార్వతి, రేణుక, వెం కవ్వ, ప్రచార కార్యదర్శిగా గుర్రం అనుదీప్‌లు ఎన్నికయ్యారు.

సంఘ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

చొప్పదండి, జనవరి 28: మండలంలోని దేశాయిపేట గ్రామంలో ఆదివారం మహిళ సంఘం, గొల్లకుర్మ సంఘం, గౌడ సంఘం, అంబేడ్కర్ సంఘ భవనాలతోపాటు వైకుంఠధామాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంట రవి, ఎంపీటీసీ కూకట్ల తిరుపతి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు రంగన్న, కొట్టె అశోక్, మునిగాల సుధాకర్‌గౌడ్, పెరుమాండ్ల రవీందర్, జక్కన్న, మోహన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, ఎల్లాల ఆదిరెడ్డి, సోమిడి శ్రీనివాస్‌రెడ్డి, మచ్చ రమేశ్, మొగిలి రమేశ్, పెద్ది రాజేందర్, నిజానపురం చందు, కళ్యానపు శ్రీనివాస్, జహంగీర్, విద్యాసాగర్ తదితరలు పాల్గొన్నారు.

గంగాధర: తెలంగాణ ప్రజల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, నారాయణపూర్‌లో గౌడ సంఘ, కురుమ సంఘ,మహిళా సంఘ భవానాలను ప్రారంభించి, రంగరావుపల్లిలో రెడ్డి సంఘ భవనానికి భూమి పూజ, వైకుంఠధామాన్ని ఆయన ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గంగాధర వ్యవసాయ సొసైటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండ లంలోని పలుగ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాశం స్వప్నకుమార్, ఎండీ నజీర్‌హుస్సేన్, ఎంపీటీసీ అట్లరాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి సారించాలి'

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హితవు పలికారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కవ్వంపల్లి మాజీ ఎమ్మె ల్యే అయిన తనను, బీఆర్ఎస్ నాయకులను అవహేళన చేస్తూ మాట్లాడడం సరికాదని అన్నారు. మం డలాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, కోటేశ్వర్, మీసాల ప్రభాకర్ తది తరులు పాల్గొన్నారు.

ఎంపీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గన్నేరువరం, జనవరి 28: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆదివారం మండల యువ జన సంఘాల నాయకులు కోరారు. గన్నేరువరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఎంపీ దర్శించుకున్న సంద ర్భంగా యువసనసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యువజనసంఘాల అధ్యక్షుడు కాలువ నాగరాజు, తిప్పర్తి ప్రవీణ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, గౌతం, అఖిల్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, జనవరి 28: కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. చంద్రపురి కాలనీలోని వినాయక మండపం వద్ద పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద మంజూరైన పథకాలను స్థానిక కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్ అనంతరం ఎంపికైన అభ్యర్థులకు 15వేల గ్రాంట్ మొదటి విడతలో రూ.లక్ష, రెండవ విడతలో రూ.2 లక్షల రుణం అందుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్య సదుపాయం అందుతుందని కేంద్ర పథకాలను అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని కార్పోరేటర్ కోరారు.

'ఉదయ సాహితి' ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, జనవరి28: నగరంలోని ముకరంపుర, వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయ సాహితి ఆవిర్భావ దినోత్సవం, రాష్ట్ర స్థాయి కవితల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి హాజరై మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమని అన్నారు. కవులు తమ స్పందనలతో ప్రకటించే భావాలు సమాజానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ఉదయసాహితి గత కొన్నే ళ్ళుగా సాహితీ రంగంలో కవులను తీర్చిదిద్దడం అభినంద నీయమని అన్నారు. ఎర్రం రాజారెడ్డి అధ్యక్షతన ఏర్పడ్డ కొత్త కమిటీని అభినం దించారు. అతిథులుగా హాజరైన శ్రీదాస్యం లక్ష్మయ్య, దాస్యం సేనాధిపతి, నంది శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు ఎర్రం రాజారెడ్డి, రేళ్ళ సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో గుండు రమణయ్య, వెగ్గలం ఉషశ్రీ, ఎస్ నాగవేణి, విజయలక్ష్మీ శ్రీనివాస్, చిందం సునీత, కె మాధవి, డాక్టర్ తిరుమలరెడ్డి, జయపాల్‌రెడ్డి, నగునూరి రాజన్న, ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి మార్షల్ ఆర్ట్స్ దోహదం



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్ స్పోర్ట్స్ 28: విద్యార్థుల శారీరక దృఢత్వానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతుందని రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు, జిల్లా కుంగ్‌ఫూ అసోసియేష్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన డ్రాగన్ షార్ట్ కుంగ్‌ఫూ మూడవ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల ముగింపు ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శారీరక, మానసిక అభివృద్ధికి కరాటే ఉపయోగ పడుతుందని, తద్వారా విద్యార్థులు చదువులో ముందుం టారని అన్నారు. మరో అతిథి కరీంనగర్ ఏఆర్ ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ ఆటలోని గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆటలు కరాటే తప్పనిసరి అన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిద ప్రాంతాలనుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు నివేశన స్థలాలు ఇవ్వాలి

జమ్మికుంట రూరల్, జనవరి 28: సారథి కళాకారులకు ఉద్యోగ భద్రత, పీఆర్సీ వర్తింపు, వేతనాల పెంపు, 250గజాల నివేశన స్థలాలు కేటాయించాలని కోరుతూ తెలంగాణ సాసంస్కృతిక సారధి రాష్ట్ర అధ్యక్షులు రామంచ భరత్ హుజూరాబాద్‌లో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండ రామ్‌కు ఆదివారం మారముళ్ల వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి మారముళ్ల ఆనందం, జూపాక శివ, తాళ్ల సునీల్, శనిగరం బాబ్జి, వడ్లకొండ అనిల్‌కుమార్, ఎండి రహీం, యోగానంద్, వెంకన్న, శ్రీధర్, సుధాకర్, సంపత్, విజేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం'

గంగాధర, జనవరి 28: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఆదివారం మధురా నగర్ చౌరస్తాలో ముఖ్యకార్యకర్తలు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3న చొప్పదండి నియోజ కవర్గ స్థాయి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్ పర్యటన ఉంటుందన్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను గెలిపించు కుందామని అన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● చొప్పదండి: రాబోయే డీఎస్సీలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కట్టెకోల శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు.

- చొప్పదండిలో ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు ఆర్ట్ ఆఫ్ లీవింగ్ ఆధ్వర్యంలో హాపీనెస్ ప్రోగ్రాం నిర్వహించను న్నట్లు ఆడెపు రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనా న్ని నిర్మించేందుకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన సందర్భంగా మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనకు సభ్యులు విజ్ఞప్తి చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రా మానికి చెందిన గిన్నారపు మహేందర్‌ను బీఎస్పీ మండ లాధ్యక్షుడిగా నియమిస్తూ నియోజకవర్గ అధ్యక్షుడు వాసా ల రామస్వామి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని కాచా పూర్ గ్రామానికి చెందిన మాతంగి ఓదెయ్య (65) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా జైభీమ్ గ్రూప్ కుల సంఘం వారు మృతుడి కుటుంబా నికి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజే శారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంద్ర రాజయ్య, గ్రూప్ అధ్యక్షుడు మోరి పోచయ్య, క్యాషియర్ మారముల్ల వీరయ్య, మాతంగి శ్రీనివాస్, ఎస్ కొంరయ్య, కనుకుంట్ల వీరయ్య, ఓదెయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని లక్ష్మీపూర్ గ్రామా నికి చెందిన ఎడ్ల శ్రీధర్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారా యణ. డీసీసీ అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, మండ ల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

- మానకొండూర్ మండల సర్వసభ్య సమావేశం సో మవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలి పారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవు తారని తెలిపారు.